క్లుప్తంగా

సెక్టోరియల్ అధికారి పద్మజకు వీడ్కోలు


పద్మజను సన్మానిస్తున్న డీఈవో యాదయ్య, స్పెషల్ ఆఫీసర్లు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సెక్టోరియల్ అధికారిగా విధులు నిర్వర్తించి రిలీవ్ అయిన పద్మజను కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు ఘనంగా సన్మానించారు. జిల్లా సైన్స్ సెంటర్‌లో బుధవారం డీఈవో యాదయ్య ఆధ్వర్యంలో సెక్టోరల్ అధికారిగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని, తిరిగి పాఠశాల పీజీ హెచ్‌ఎంగా వెళ్లిపోయిన పద్మజను శాలువాలతో సత్కరించటంతో పాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు స్పెషల్ ఆఫీసర్లు పద్మజ అందించిన సేవలను కొనియాడుతూ, వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు హేమలత, శ్రీనివాస్, ఎఫ్ఏవో సఫ్దర్ అలీఖాన్, ఎస్‌వోలు పాల్గొన్నారు.

ఉచితంగా మోకాళ్ల ఆపరేషన్


దుర్గప్రసాద్‌తో ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని జైపూర్ గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన దర్జి దుర్గ ప్రసాద్‌కు జిల్లా కేంద్రంలోని టచ్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మాటేటి శ్రీనివాస్, డాక్టర్ బి.ఎన్.రావు ఫౌండేషన్, డాక్టర్ ఓం ప్రకాశ్ సహకారంతో ఉచిత మోకాళ్ల ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా టచ్ ఆసుపత్రి డైరెక్టర్లు మాట్లాడుతూ.. మోకాళ్ల ఆపరేషన్‌కు రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుందని, పేదరికంతో ఉన్న దుర్గాప్రసాద్ పరిస్థితిని డాక్టర్ బి.ఎన్.రావు ద్వారా తెలుసుకుని ఉచితంగా శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ ఉచితంగా చేసిన ఆసుపత్రి యాజమాన్యానికి దుర్గప్రసాద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన విద్యావిధానం రద్దు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: నూతన విద్యా విధానం రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలో బుధవారం ఛలో రాజ్‌భవన్ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకత్వాన్ని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

4న కార్మిక గర్జన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ శ్రేణులు

బెల్లంపల్లి: కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న హైదరాబాద్‌లో కార్మికగర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ జిల్లా నాయకులు సయ్యద్ సాజిద్, గోపతి రాజలింగు తెలిపారు. బెల్లంపల్లి బూడిదగడ్డ బస్తీ ఏరియాలో బుధవారం కార్మిక గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఇఫ్టూ ఆధ్వర్యంలో కార్మికగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దుర్గే ఈశ్వర్, సికిందర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నంది అవార్డుకు ఎంపికైన బెల్లంపల్లివాసి

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన అంబేడ్కర్ వాది గంధం శంకర్ జాతీయ నందీ అవార్డుకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌కు చెందిన శిఖరం ఆర్ట్ థియేటర్ వ్యవస్థాపక కార్యదర్శి జీ.కృష్ణ అవార్డును ప్రకటించారు. సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను శంకర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 22న న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ అంబేద్కర్ ఆడిటోరియంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో జాతీయనంది అవార్డును అందజేయనున్నట్లు ప్రకటించారు.

తాగునీటికి కటకట!

- బెల్లంపల్లిలో 15రోజులుగా 'భగీరథ' నీరు బంద్
- పగిలిన అంతర్గత పైపులు
- అవస్థలు పడుతున్న పురప్రజలు



నా పేరు బెరుగు సుదర్శన్. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని టేకుల బస్తీ మాది. మిషన్‌భగీరథ పథకం నీళ్లు రాక పదిహేను దినాలైంది. భారీ వర్షాలకు నీటి సరఫరా ఆగింది. ఆసిఫాబాద్‌లోని అడ ప్రాజెక్టు దగ్గర పైపులు పగిలినయ్ అని చెప్పిండ్లు కానీ, ఇంతవరకు ఆ పనులు పూర్తి చేయలేదు. నీటి సరఫరాను మెరుగుపర్చలేదు. నీళ్ల రాక బోరు నీళ్లు తాగుతున్నం. చిలుము నీళ్లే దిక్కైతన్నయ్. మున్సిపల్ వాటర్ ట్యాంకర్ మా వార్డుకు రావడం లేదు. నీళ్ల కోసం మస్తు తిప్పలైతంది. ఈ ఆవేదన కేవలం సుదర్శన్ ఒకరిదే కాదు మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న ప్రజలందరిదీనూ.



బెల్లంపల్లి: పురప్రజలను తాగునీటి కష్టాలు తీవ్రంగా వేధిస్తున్నాయి. వర్షాల కారణంగా ఆసిఫాబాద్‌లోని అడ ప్రాజెక్టుకు వరద నీరు తీవ్రంగా పోటెత్తి నీరు కలుషితం కావడం, అదే క్రమంలో మోతుగూడ, మేర్‌పల్లి ప్రాంతాల్లో అంతర్గత పైపులైన్లు పగిలిపోవడం వంటి సమస్యలతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పక్షం రోజులు కావస్తున్నా ఇంతవరకు పైపులైన్ పనులు పూర్తి చేయకపోవడంతో తాగునీటి కోసం పురప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ప్యూరీఫైడ్ వాటర్‌ను క్యాన్‌కు రూ.30చెల్లించి రోజులు వెళ్లదీస్తున్నారు. నీటి అవసరాలు పెరిగిపోయి ప్రజలు అరిగోస పడుతున్నారు. మరో మార్గం లేక బోరు పంపులను, సింగరేణి ఏర్పాటు చేసిన ట్యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. బోర్ల నుంచి చిలుము నీరు వస్తుండగా ప్రత్యామ్నాయం లేక ఆ నీటితోనే అవసరాలను తీర్చుకుంటున్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా 13వేల పైచిలుకు నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి. వీటి ద్వారా తాగునీరు అందించాల్సి ఉండగా, నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తాగునీటి కోసం పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారి వేదన కలిగిస్తున్నాయి.

ప్రత్యామ్నాయ చర్యలు అంతంతే...

మిషన్‌భగీరథ పథకం తాగునీటి సరఫరా నిలిచిపోయి నానా యాతన పడుతున్నా ప్రత్యామ్నాయ చర్యలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. మున్సిపాలిటీ వ్యాప్తంగా 34వార్డుల్లో తాగునీటి కటకట ఉంది. అయితే మున్సిపల్ తరఫున ప్రత్యేకంగా వార్డుల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నా, అన్ని వార్డుల్లో నీటి సరఫరా జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమైన ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులకు మాత్రమే వాటర్ ట్యాంకర్లు వెలుతున్నాయి తప్పా ఇతర వార్డుల వైపు వెళ్లడం లేదని పలువురు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పేర్కొంటున్నారు.

పాలకవర్గానికి పట్టింపు ఏది..?

నీటి సమస్యతో రోజుల తరబడి అల్లాడుతున్నా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శలను ఎక్కుపెడుతున్నారు. వాస్తవానికి మున్సిపల్ పాలకవర్గం ముందుండి నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఆ దిశగా యత్నాలు చేసిన పాపాన పోవడం లేదు. మిషన్ భగీరథ పథకం పైపులైన్ మరమ్మతు పనుల వ్యవహారంపై, ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టిసారించడంలో మున్సిపల్ పాలకవర్గం బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని పుర ప్రజలు ఆగ్రహం చెందుతున్నారు. ఇప్పటికైన సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పైపులైన్ లీకేజీ పనులు జరుగుతున్నాయి

వర్షాలతో అంతర్గతంగా ఏర్పాటు చేసిన పైపులైన్ లీకేజీలు జరిగాయి. కొద్దిరోజులుగా పనులు జరగగా ప్రస్తుతం మళ్లీ వర్షాలు పడుతుండటంతో పనులకు అంతరాయం కలుగుతోంది. అందువల్ల లీకేజీ మరమ్మతు పనులు మందకొడిగా జరుగుతున్నాయి. నీటి సరఫరా ఎప్పటి వరకు చేస్తామో చెప్పలేం కానీ, పనులను సత్వరంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా తాగునీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- సరేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఆసిఫాబాద్

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

జన్నారం: వర్షాలకు నీటిలో పడి చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ అధికారులు బుధవారం మరమ్మతు చేపించారు. ఈ నెల 1న 'విద్యుత్ విపత్తు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను లక్సెట్టిపేటకు తరలించి, మరో ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొచ్చి అమర్చారు. అదే విధంగా గోదావరి తీర ప్రాంతాల్లో పడిపోయిన విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులు కూడా చేయిస్తున్నట్లు ఏఈ లచ్చ య్య తెలిపారు. విద్యుత్ కోతలు లేకుండా చూస్తామని, ఏదైన సమస్య అయితే తప్పా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూస్తామన్నారు.


కవ్వాల్‌లో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతున్న సిబ్బంది

జీపీ కార్మికుల వినూత్న నిరసన


దండేపల్లి: బతుకమ్మ ఆడుతున్న జీపీ కార్మికులు


భీమారంలో జీపీ కార్మికుల సమ్మె

భీమారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/కాసిపేట: తమ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా మల్టీపర్పస్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 28వ రోజుకు చేరింది. దండేపల్లిలో గ్రామ పంచాయతీ కార్మికులు బతుకమ్మ ఆట ఆడి నిరసన తెలిపారు. హాజీపూర్ వంట-వార్పు కార్యక్రమం నిర్వహించారు. భీమారం మండలంలో కార్మికులకు ధర్మసమాజ్ మంచిర్యాల జిల్లా నాయకులు రామస్వామి, రాకేష్ సంఘీభావం ప్రకటించారు. కాసిపేటలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణ, మండల మాజీ అధ్యక్షుడు తిరుపతి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు స్వామి మద్దతు తెలిపారు.

కార్మికులు బీమా కలిగి ఉండాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్


బాండ్ అందిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్

మంచిర్యాలటౌన్: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ బీమా కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భవననిర్మాణ కార్మిక సంఘం భవనంలో బుధవారం పోస్టాఫీసు బీమా బాండ్లను ప్రధాన తాపీమేస్త్రీలు, తాపీమేస్త్రీలకు జిల్లా అదనపు కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల కారణంగా అకస్మాత్తుగా కుటుంబ పెద్ద మృతి చెందితే, బాధిత కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందని, బీమా పొందినట్లయితే ఎన్నో లాభాలు చేకూరుతాయన్నారు. ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, పోస్టాఫీస్ అధికారులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

జలపాతం సందర్శించిన అదనపు కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రానికి దాదాపు 20కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రకృతి సిద్ధమైన పాలనురగలా జాలువారే అందమైన జలపాతం విశేషాలను ఇటీవల 'సాక్షి' దినపత్రిక వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో జలపాతం సందర్శనకు సందర్శకుల తాకిడి విపరీతంగా పెరిగిపోయింది. సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన హాజీపూర్ మండల ర్యాలీలోని జలపాతం వివరాలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జలపాతం అందాలను ప్రత్యక్షంగా వీక్షించడమే కాదు జలపాతంలో తడుస్తూ చాలా సేపు ఎంజాయ్ చేశారు.

'తొలిమెట్టు'పై శిక్షణ తరగతులు


చెన్నూర్: ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణ ఇస్తున్న ఎంఈవో


బెల్లంపల్లి: శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న కోర్సు డైరెక్టర్లు

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం తొలిమెట్టు కార్యక్రమాన్ని ఎంఈవో వాసాల ప్రభాకర్ ప్రారంభించారు. ఉపాధ్యాయులకు 8వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్‌అధికారి వై.సత్యనారాయణ, ఆర్పీలు వేణుగోపాల్‌రావు, మల్లేష్, జిల్లా పిన్ పరిశీలకులు విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి: బోధనసులభతరం చేసేందుకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం చేపట్టినట్లు ఎంఈవో రవీందర్ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8వరకు ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌పై నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి మండల నోడల్ అధికారి పర్వతి సత్యనారాయణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం పానుగంటి లచ్చయ్య, కొండు జనార్దన్, శ్రీనివాసరావు, సుజాత, రాజేశ్వర్‌రావు, నర్సయ్య, మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

చెన్నూర్: తొలిమెట్టులో భాగంగా భాష తెలుగు సామర్థ్యాలపై నిర్వహించే శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోర్స్ డైరెక్టర్, ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ప్రతి విద్యార్థికి పునాది నుంచి తెలుగు, ఇంగ్లిష్, గణిత శాస్త్రలలో చదవడం, రాయడం నేర్పించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ కరుణాకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు లీలరాణి, సాంబయ్య పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని లంబాడితండా(ఎస్) జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు తొలిమెట్టు(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 2నుంచి 8వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు విద్యార్థులకు నేర్పించి అన్ని సామర్థ్యాలు సాధించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నెన్నెల లచ్చయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం లతీఫ్, జిల్లా పరిశీలకులు విద్యాసాగర్, రిసోర్స్ పర్సన్ కిరణ్‌కుమార్, సీసీవో రాంబాబు తదితరులున్నారు.

బెల్లంపల్లి: ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా బాషా, గణిత సామర్థ్యాలపై బుధవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. బెల్లంపల్లి కేంద్రంగా బెల్లంపల్లి, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల ఉపాధ్యాయులకు వేర్వేరుగా శిక్షణ తరగతులు చేపట్టారు. బెల్లంపల్లి మండల ఉపాధ్యాయులకు బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాల ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతుల్లో బెల్లంపల్లి మండల విద్యాశాఖఅధికారి మహేశ్వర్‌రెడ్డి, కోర్సు డైరెక్టర్లుగా శైలజ, ఎస్.లింగయ్య, మహేశ్వర్ రెడ్డి, రఘుబాబు వ్యవహరించారు. ఆయా మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చెన్నూర్: రైతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష రూపాయల రుణమాఫీ ప్రకటించడంపై స్థానిక తెలంగాణ తల్లి చౌక్‌లో చెన్నూర్ పట్టణ, మండల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కేసీఆర్ రైతు పక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాపు, మార్కెట్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, సాధనబోయిన కృష్ణ, బత్తుల సమ్మయ్య, ఖలీల్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'గడపగడపకూ పీఎస్సార్'

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 8వ వార్డు పాత మంచిర్యాలలో బుధవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఇంటింటికీ వెళ్లి, ప్రజలను పలకరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గడపగడపకూ పీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా వార్డులోని ఇంటింటికీ వెళ్లి, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రజలకు ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలను వివరించారు. గతంలో కేంద్ర, రాష్ట్రాలను పాలించిన కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.



'సమాజానికి నాణ్యమైన వార్తలు అందించాలి'


మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ సదయ్య

మందమర్రిరూరల్: జర్నలిస్టులు సమాజానికి నాణ్యమైన వార్తలు అందించాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య పేర్కొన్నారు. మందమర్రిలోని సీఈఆర్ క్లబ్‌లో బుధవారం మందమర్రి, రామకృష్ణాపూర్ జర్నలిస్టులకు సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏసీపీ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. కొంతమంది వ్యక్తిగత కక్ష్యలతో ఇష్టారీతిగా వార్తలు రాస్తూ, అశాంతిని నెలకొల్పుతున్నారన్నారు. పోలీసులతో విలేకరులు కలిసి పనిచేసి, సమాజానికి మేలుచేసి ఎన్నికలు వస్తున్న దృష్ట్యా ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మందమర్రి ఎస్సై చంద్రకుమార్, రామకృష్ణాపూర్ ఎస్సై అశోక్ ఉన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్

- రూ.17,600 నగదు స్వాధీనం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సాయినాథ్ లాడ్జ్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సాయినాథ్ లాడ్జిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు లాడ్జిలో ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.17వేల 6వందల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు


బెల్లంపల్లి: మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్వేత

చెన్నూర్/జైపూర్/జన్నారం/భీమిని/తాండూర్/చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లి: బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలే సురక్షితమని, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలని అంగన్‌వాడీ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సీడీపీఓలు సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం పలు మండల కేంద్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి ప్రాముఖ్యతపై గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో చెన్నూర్‌లో సీడీపీవో మనోరమ, కౌన్సిలర్ నాయిని శ్యామల, సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు విజయ, ఖానీస్ ఫాతిమా, జైపూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, సర్పంచ్ గడ్డం మంజుల, ఏఎన్ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు కల్యాణి, తిరుమలేశ్వరి, సరిత, ఆశ భాగ్య, జన్నారంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, కవిత, సర్పంచ్ జాడి గంగాధర్, అంగన్‌వాడీ టీచర్లు తిరుపతమ్మ, జమున, సంజీవరాణి, భీమినిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా భీమక్క, తాండూర్‌లో సూపర్‌వైజర్ మమత, సర్పంచ్‌లు సునీత, దాగం శంకరమ్మ, ఏపీఎం ఫోమానాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమారాణి, సుజాత, లీలారాణి పాల్గొన్నారు. చెన్నూర్ మండలం సోమనపల్లిలో సర్పంచ్ భీమిని శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత, ఏఎన్ఎం హరిత, అంగన్‌వాడీ టీచర్లు దేవేంద్ర, శోభారాణి, ఆశకార్యకర్తలు సంతోష, రమణి, బెల్లంపల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, సూపర్‌వైజర్ మెర్సీ, ఏఎన్ఎం విమల, ఆర్పీ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ బాగు చేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై ఉన్న వాకింగ్‌ట్రాక్ పూర్తి బురదగా మారి, వాకింగ్ చేసుకునే వారికి ఇబ్బందిగా మారుతోందని, ట్రాక్‌ను బాగు చేయాలని కోరుతూ రామునిచెరువు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

'స్థానిక నాయకులకే అవకాశం ఇవ్వాలి'

మంచిర్యాలటౌన్: జిల్లాలో నేతకాని సామాజిక వర్గం ఎక్కువగా ఉన్నందునా ప్రధాన రాజకీయ పార్టీలు స్థానికంగా ఉన్న నేతకాని సామాజికవర్గానికి చెందిన వారికే ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని నేతకాని సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం సమ్మయ్య ఒక ప్రకటనలో కోరారు.

ఎకరానికి రూ.50వేలు పరిహారం చెల్లించాలి

చెన్నూర్‌రూరల్: పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల నష్ట పరిహారం అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు రాకేష్ అన్నారు. సుందరసాలలో ముంపునకు గురైన పంటను పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

సిబ్బందితో సమీక్ష

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మయ్య అధ్యక్షతన ఉపాధిహామీ, పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ కోసం రికార్డులు సిద్ధం చేయాలని, హార్టికల్చర్ లబ్ధిదారులను గుర్తించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వేమనపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ బాపురావు అన్నారు. మండలంలోని రాజారాం గ్రామాన్ని బుధవారం మొబైల్ యాప్‌లో భాగంగా పరిశీలించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు ముమ్మరం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీలో భాగంగా బుధవారం 8, 10వార్డుల్లో బ్లీచింగ్, హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారీ చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నెన్నెల: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను భీమిని డివిజన్ ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్ బుధవారం తనిఖీ చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ నీలకంఠేశ్వరరావు అన్నారు. దండేపల్లి మండలం వందుర్‌గూడ గిరిజన గ్రామాన్ని బుధవారం సందర్శించి, గిరిజనులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఇప్పలగూడలో కమ్యూనిటీ కాంటాక్ట్

దండేపల్లి: మండలంలోని ఇప్పలగూడలో ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలోకి కొత్తవ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట అదనపు ఎస్సై రామయ్య, దండేపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి పంచాయతీలో సర్పంచ్ శశికళ ఆధ్వర్యంలో బుధవారం సోలార్ విద్యుత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కుట్టు మిషన్ల పంపిణీ

జన్నారం: మూడు నెలలుగా ఉచితంగా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు న్యాక్ సంస్థ వారు బుధవారం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అసిస్టెంట్ లేబర్ అధికారి రామ్మోహన్, న్యాక్ ఏడీ నాగేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : క్రిష్ణ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899